దేవాలయాల పవిత్రతను కాపాడాలి


జ్ఞానసరస్వతీ ఆలయంలో ప్రమాణం చేస్తున్న నూతన కమిటీ

మల్కాజిగిరి: అన్ని ధర్మాల్లో కంటే హిందూధర్మం గొప్పదని, దేవాలయాల పవిత్రను కాపాడాలని కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్ సూచించారు. శుక్రవారం అనంతసరస్వతీనగర్‌లోని జ్ఞాన సరస్వతీ అమ్మవారి దేవాలయం, ఆనంద్‌బాగ్‌లోని లలితాపరమేశ్వరి అమ్మవారి దేవాలయం నూతన కమిటీ ప్రమాణ స్వీకారం జరిగింది. కార్పొరేటర్ భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా మెరుగైన వసతులు కల్పించి నూతన కమిటీ ఆలయాల పవిత్రతను కాపాడాలన్నారు. జ్ఞానసరస్వతీ అమ్మవారి దేవాలయం చైర్మన్‌గా హరీష్, సభ్యులుగా రాఘవేంద్రచారి, గోపీనాథ్, బాలస్వామి, శ్రీకాంత్, బుచ్చిబాబు, మంగమ్మ, లలితాపరమేశ్వరి అమ్మవారి దేవాలయం చైర్మన్‌గా దాసరి లింగేశ్వరరావు, సభ్యులుగా శారద, సాయినాథ్, ఏడుకొండలు, రాగం రాజుయాదవ్, రాజేష్‌లతో దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ మోహన్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేయించారు. ఈఓ రవీందర్‌రెడ్డి, నాయకులు వెంకటేష్‌యాదవ్, జీఎన్వీ సతీష్ కుమార్, ఉమేష్‌సింగ్, శ్రీనివాస్, నాగరాజు, సానాది శంకర్, వినోద్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల చదువుకు ఎమ్మెల్యే బాసట


చెక్కును అందజేస్తున్న హరీశ్‌రావు, ఎమ్మెల్యే బండారి

మల్లాపూర్: ఎంబీబీఎస్ విద్యార్థుల చదువుకి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి బాసటగా నిలుస్తున్నారు. మల్లాపూర్ డివిజన్‌కు చెందిన సీతాల విజయ్‌కుమార్ కుమార్తె అఖిల ప్రతిమ మెడికల్ కాలేజీ వరంగల్‌లో ఎంబీబీఎస్ సీటు సాధించింది. నాగలక్ష్మినగర్ కాలనీకి చెందిన శ్రీనివాస్ కుమారుడు జీవన్‌కుమార్ వనపర్తి ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ సీటు సాధించాడు. వీరిని శుక్రవారం బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి చదువుకు అయ్యే ఫీజును ఒక్కొక్కరికి రూ.29 వేల చెక్కును మాజీ మంత్రి హరీష్‌రావు చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు. మాజీమంత్రి హరీష్‌రావు మాట్లాడుతూ.. బీఎల్ఆర్ చారిటుబుల్ ట్రస్ట్ ద్వారా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి చేయూతను అందించడం అభినందనీయమన్నారు. మల్కాజిగిరి పార్లమెంట్ ఇన్‌చార్జి రాగిడి లక్ష్మారెడ్డి, మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



అల్వాల్: ఐదు దశాబ్దాల క్రితం విడిపోయిన స్నేహితులు కలుసుకుని చిన్ననాటి మధురస్మృతులను గుర్తు చేసుకున్నారు. అల్వాల్‌లోని జిల్లా పరిషత్ పాఠశాలలో 1969లో పదోతరగతి పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థులు శుక్రవారం అల్వాల్‌లో కలుసుకున్నారు. విద్యార్థి దశలో జరిగిన సంఘటనలను గుర్తు చేసుకుంటూ.. సరదాగా గడిపారు. కూకుట్ల లక్ష్మయ్య, విజయ్‌కుమార్, అంజయ్య, రాంచందర్, బాలమల్లేష్, నర్సింహాస్వామి, లక్ష్మణ్‌రావు, సత్యనారాయణ, కృష్ణారావు, అశోక్‌కుమార్, నారాయణ్, ఆంజనేయులు, శంకర్, రంగారావు, లక్ష్మయ్య, రజినీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న చేనేత వస్త్ర ప్రదర్శన

అల్వాల్: అల్వాల్‌లోని శ్రీసాయిగార్డెన్ హాల్‌లో ఏర్పాటు చేసిన కళాసిల్క్ హస్తకళ ప్రదర్శన వినియోగదారులను ఆకట్టుకుంటుంది. ఈ సందర్భంగా నిర్వాహకులు వికాస్ జైన్ మాట్లాడుతూ.. ఈ ప్రదర్శనలో పోచంపల్లి బెడ్‌షీట్స్, కుర్తీస్, బాగల్పూర్ సిల్క్ శారీస్, ఖాదీ షర్ట్స్, కశ్మీరి సిల్క్ శారీస్, ఉప్పాడ శారీస్, వెస్ట్ బెంగాల్ కాటన్ శారీస్, వన్‌గ్రామ్ గోల్డ్, మంగళగిరి, వెంకటగిరి, ధర్మవరం, ఉప్పాడ శారీస్ అందుబాటులో ఉన్నాయని, దీపావళి పండుగ సందర్భంగా నూతన కలెక్షన్లు ఉన్నాయని, ఈనెల 25వ తేదీ వరకు ప్రదర్శన ఉదయం 11 గంటల నుంచి రాత్రి 9 గం. వరకు అందుబాటులో ఉంటుందని తెలిపారు.



ఉద్యమకారుల సభను విజయవంతం చేయాలి



అల్వాల్: తెలంగాణ ఉద్యమకారుల సభను విజయవంతం చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పటోళ్ల సురేందర్ రెడ్డి, మల్కాజిగిరి నియోజకవర్గ అధ్యక్షులు పుటాన్ల కృష్ణలు కోరారు. శుక్రవారం అల్వాల్‌లో జరిగిన తెలంగాణ ఉద్యమకారుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. త్వరలో మల్కాజిగిరి నియోజకవర్గంలో ఉద్యమకారుల సభను నిర్వహించనున్నట్లు ప్రకటించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో అలుపెరగని పోరాటం చేసిన అన్ని వర్గాల వారిని ఈ సభ ద్వారా మరోసారి గుర్తు చేసుకుంటూ వారికి అభినందనలు తెలియజేస్తున్నట్లు చెప్పారు. దీనికి ఉద్యమకారులు అందరూ సహకరించాలని కోరారు. ఫోరం నాయకులు మంద శోభన్‌బాబు, దయాకర్‌గౌడ్, దేవేందర్, వెంకటేష్‌యాదవ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల స్టైఫండ్ విడుదల చేయాలి



రామంతాపూర్: ప్రభుత్వ హోమియోపతి మెడికల్ కళాశాలలో పెండింగ్ స్టైఫండ్‌ను విడుదల చేయాలని వైద్య విద్యార్థులు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా శుక్రవారం అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, డాక్టర్ శివప్రసాద్ మాట్లాడుతూ.. రామంతాపూర్‌లోని జయసూర్య పొట్టి శ్రీరాములు ప్రభుత్వ హోమియోపతి మెడికల్ కళాశాలలో పీజీ విద్యార్థులకు ఇంటెన్షిప్ గత 8 నెలలుగా స్టైఫండ్ అందడం లేదన్నారు. ఈ సమస్యతో విద్యార్థుల ఆర్థికస్థితిపై తీవ్ర ప్రభావం పడుతుందన్నారు. స్టైఫండ్‌ను విడుదల చేయకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ విషయంపై త్వరలో వైద్య ఆరోగ్యశాఖ మంత్రి రాజనర్సింహను కలిసి వినతిపత్రం అందజేస్తామని పేర్కొన్నారు. డాక్టర్ ఆకాష్, డాక్టర్ వివేక్, డాక్టర్ పల్లగ్ తదితరులు పాల్గొన్నారు.

జీవన ప్రమాణానికి ప్యాలియేటివ్ కేర్ దోహదం


రోగితో మాట్లాడుతున్న జిల్లా విద్యాధికారి డాక్టర్ రఘునాథ్‌స్వామి

మల్కాజిగిరి: మల్కాజిగిరి జిల్లా కేంద్ర ఆసుపత్రిలో ప్యాలియేటివ్ సేవలను ఉపయోగించుకోవాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ రఘునాథ్‌స్వామి అన్నారు. శుక్రవారం ప్రపంచ ప్యాలియేటివ్, హాస్పిస్ దినోత్సవాన్ని కేర్ సెంటర్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రోగులను చికిత్స అందుతున్న వివరాలను అడిగి తెలుసుకున్నారు. దీర్ఘకాలిక రోగాలు, తీవ్రమైన వ్యాధులతో బాధపడుతున్న రోగుల జీవిత ప్రమాణాన్ని పెంచడానికి ప్యాలియేటివ్ కేర్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. చాలా వ్యాధులు నయం కావడానికి సరైన అవగాహన ముఖ్యమన్నారు. జిల్లా స్థాయి అసంక్రమణీయ రోగాల(ఎన్‌సీడీ) కార్యక్రమ అధికారి డాక్టర్ మల్లీశ్వరి, అదనపు అధికారి డాక్టర్ కౌశిక్ పాల్గొన్నారు. కేర్ సెంటర్‌లోని రోగులకు పండ్లు పంపిణీ చేశారు.

‘పది’లో ‘వంద’ లక్ష్యం

- పదో తరగతి విద్యార్థులకు ‘ప్రత్యేక’ తరగతులు
- ఇళ్ల వద్ద విద్యార్థులు చదివేలా ఉపాధ్యాయులతో మానిటరింగ్‌పై కసరత్తు
- 108 ప్రభుత్వ పాఠశాలల్లో 8 వేల మంది విద్యార్థులు



సాక్షి,సిటీబ్యూరో: ప్రభుత్వ బడులపై మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా విద్యాశాఖ స్పెషల్ ఫోకస్ పెడుతోంది. కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలతో పోటీ పడే విధంగా ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి పథంలో కొనసాగుతోంది. ఈ నేపథ్యంలోనే అక్టోబర్ నుంచి 108 ప్రభుత్వ బడుల్లో చదువుతున్న 8 వేల మంది విద్యార్థులకు ఆయా పాఠశాలల్లో సాయంత్రం వేళల్లో జిల్లా విద్యాశాఖ ప్రత్యేక తరగతులు కొనసాగేలా చర్యలు తీసుకుంటోంది. ఈ ప్రత్యేక తరగతుల నిర్వాహణ కార్యక్రమాన్ని 3 ఏళ్లుగా నిర్వహించటం ద్వారా జిల్లా విద్యాశాఖ మంచి గుర్తింపును సాధించింది. అలాగే, గత బీఆర్ఎస్ హయాంలో ప్రభుత్వ బడుల్లో మన బడి–మన ఊరు–మన బస్తీ పథకం కింద 176 పాఠశాలల్లో అదనపు గదుల నిర్మాణంతోపాటు మౌలిక సదుపాయాలను కల్పించగా, అమ్మ ఆదర్శ పాఠశాలల కార్యక్రమం కింద కాంగ్రెస్ ప్రభుత్వం సంబంధిత అమ్మ ఆదర్శ కమిటీ ద్వారా 286 ప్రభుత్వ పాఠశాలల్లో రూ.12.01 కోట్లతో 699 మరమ్మతులు తదితర అభివృద్ధి పనులను చేపట్టింది.



అలాగే, ప్రపంచాన్ని కుదిపేసిన కొవిడ్ మహమ్మారి విద్యాసంస్థలపై పెను ప్రభావాన్ని చూపగా, ఆ క్లిష్ట పరిస్థితుల నుంచి విద్యార్థులను గట్టెక్కించటానికి విద్యాశాఖ ‘మేడ్చల్ బడి’ యాప్ ద్వారా ఆన్‌లైన్ తరగతులను నిర్వహించి తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ ఉన్నతాధికారుల నుంచి మన్ననలను అందుకుంది. పుస్తక పఠనం పేరుతో రీడింగ్ క్యాంపెయిన్ నిర్వహించింది. బాలికా సాధికారత కోసం పాఠశాలల్లో కమిటీ(క్లబ్)లు, టూరిజం ప్రాధాన్యతను విద్యార్థులు తెలుసుకునేలా సర్కారు బడుల్లో పర్యాటక క్లబ్బులు ఏర్పాటు చేసింది. ప్రభుత్వ ఆదేశాల నేపథ్యంలో అనేక కార్యక్రమాలకు జిల్లా విద్యాశాఖ శ్రీకారం చుట్టింది. ప్రభుత్వ బడుల్లో ఆంగ్ల విద్య కొనసాగుతుండటంతోపాటు ఉచిత పాఠ్య, నోట్ పుస్తకాలు, డ్రెస్సుల సరఫరా వంటి కార్యక్రమాల నేపథ్యంలో విద్యాశాఖ చేపట్టిన బడిబాట కార్యక్రమానికి భారీగా స్పందన లభిస్తోంది.

కరోనా మహమ్మారి నేర్పిన గుణపాఠంతో మూడేళ్లుగా ప్రభుత్వ పాఠశాలల్లో 3 వేల నుంచి 4 వేల విద్యార్థులు చేరటం, ముఖ్యంగా ప్రైవేట్ పాఠశాలల నుంచి వచ్చి మరీ ప్రభుత్వ బడుల్లో చేరారు. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ఏ జిల్లాలో లేని విధంగా 515 ప్రభుత్వ పాఠశాలల్లో 1.07 లక్షల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన డీఎస్సీ–2024లో ఖాళీగా ఉపాధ్యాయ పోస్టులు కూడా భర్తీ అయ్యాయి. ఈ నేపథ్యంలోనే విద్యాశాఖ మరింత పట్టుదలతో విద్యా ప్రమాణాల మెరుగుతో పాటు పదవ తరగతిలో వంద శాతం ఉత్తీర్ణతపై ప్రత్యేక దృష్టి సారిస్తోంది.

ప్రత్యేక తరగతులపై ఫోకస్

మార్చిలో జరిగే పదో తరగతి కామన్ పరీక్షలను దృష్టిలో పెట్టుకుని విద్యార్థులకు స్పెషల్ క్లాసులు నిర్వహించటంతోపాటు చదువులో వెనుకబడి ఉన్న విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తోంది. ప్రభుత్వ పాఠశాలల వారిగా తల్లిదండ్రులతో ఉపాధ్యాయులు, విద్యాధికారులు దశల వారీగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మండల, పాఠశాల స్థాయిల్లో విద్యాధికారులు, ఉపాధ్యాయులతో సమీక్షలు నిర్వహించిన జిల్లా విద్యాశాఖ సిలబస్ రివిజన్ చేసే ప్రక్రియకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించారు. అలాగే, ఈ నెల నుంచి జిల్లాలో 108 ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఆయా బడుల్లో ప్రత్యేక క్లాసులను నిర్వహిస్తోంది.

వెనుకబడిన సబ్జెక్టుల్లో స్పెషల్ క్లాసులు

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో గతంలో పదో తరగతి విద్యార్థుల్లో ఎక్కువగా ఫెయిల్ అయినట్లు భావిస్తున్న గణితం, సామాన్య శాస్త్రం సబ్జెక్టుల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. వారానికి 12 తరగతులు బోధిస్తున్న ఉపాధ్యాయులు ఇందులో 4 తరగతులు గణితం, 5 తరగతులు సామాన్య శాస్త్రం, 3 పిరియడ్లు సాంఘీక శాస్త్రం, ఆంగ్లం, తెలుగు బోధించే విధంగా కసరత్తు చేస్తోంది.అలాగే, పదో తరగతి విద్యార్థులను వచ్చే ఫిబ్రవరి నుంచి ప్రతి రోజు ఉదయం 4 నుంచి 5 గంటల వ్యవధిలో ఫోన్ల ద్వారా నిద్ర లేపేందుకు ప్రత్యేక తరహాలో ఉపాధ్యాయులను కేటాయించటంతో పాటు వారి పని తీరును పర్యవేక్షించేందుకు జిల్లా విద్యాశాఖ కార్యాచరణ ప్రణాళిక ఖరారుతో ముందుకు సాగుతోంది.



టెన్త్ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి



సబ్జెక్ట్‌ల వారీగా చదువుల్లో వెనుకబడిన విద్యార్థులను గుర్తించాం. వారికి ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నాం. గతంలో తక్కువగా వచ్చిన ప్రైవేట్ స్కూళ్లపై కూడా దృష్టి సారిస్తున్నాం. వంద శాతం విద్యార్థుల ఉత్తీర్ణత లక్ష్యంగా ప్రత్యేకంగా నోట్స్ తయారు చేసి అందజేస్తున్నాం.
– మేడ్చల్,మల్కాజిగిరి జిల్లా డీఈఓ,విజయకుమారి

పారిశుద్ధ్య సిబ్బందితో వాగ్వివాదం !

మల్కాజిగిరి: సఫిల్‌గూడ రోడ్డు పక్కన ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు నిర్వహించే వారిని పారిశుద్ధ్య సిబ్బంది తొలగించాలని చెప్పారు. దీంతో సదరు వ్యాపారులకు సిబ్బందికి మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. మహిళా పారిశుద్ధ్య కార్మికులను అసభ్య పదజాలంతో దూషించారని సిబ్బంది చెబుతున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ శ్రవణ్ మాట్లాడుతూ.. వ్యాపారం చేసుకుని చెత్తాచెదారాన్ని అక్కడే పారవేస్తున్నారని మహిళా కార్మికులు, సూపర్‌వైజర్లను దూషించినా.. ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడం సరికాదన్నారు. దీనిపై స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

‘పెన్షనర్ల పరిష్కార పరిహార వారం’


మాట్లాడుతున్న మేనేజర్ సాయిలత

గౌతంనగర్: పెన్షనర్లు తమ జీవిత ధ్రువీకరణ పత్రాలను బ్యాంకులో అందజేయాలని ఎస్‌బీఐ బ్యాంకు మేనేజర్ సాయిలత అన్నారు. శుక్రవారం హనుమాన్‌పేటలోని వెస్ట్ మల్కాజిగిరి బ్రాంచీ ఎస్‌బీఐ బ్యాంకులో పెన్షనర్ల పరిష్కార పరిహార వారం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మేనేజర్ సాయిలత మాట్లాడుతూ.. పెన్షనర్ల సమస్య పరిష్కారానికి ఎస్‌బీఐ పూర్తి సహకారం అందిస్తుందన్నారు. బ్యాంకు సిబ్బంది, పెన్షనర్లు, వినియోగదారులు పాల్గొన్నారు.

రూ.59 లక్షలతో బేబీ పాండ్ రిటైనింగ్ పనులు


పనులను పరిశీలించిన కార్పొరేటర్ శ్రవణ్

మల్కాజిగిరి: సఫిల్‌గూడ మినీట్యాంక్ బండ్ వద్ద బేబీ పాండ్‌లో రూ. 59 లక్షలతో చేపట్టిన రిటైనింగ్ పనులను స్థానిక కార్పొరేటర్ శ్రవణ్ ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ.. రిటైనింగ్ పనులు త్వరితగతిన పూర్తిచేయాలని సూచించామన్నారు. పాండ్ విస్తరణతో పాటు లేక్ అభివృద్ధికి మరిన్ని నిధులు మంజూరు చేయాలని ఇంజినీరింగ్ విభాగం అధికారులను కోరామన్నారు. డీఈ మహేష్, ఏఈ నవీన్, వీఐ రమేష్, నాగయ్య, వేణుయాదవ్, రవి పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

బోడుప్పల్: 15వ డివిజన్ పరిధిలో జరుగుతున్న బీటీ రోడ్డు పనులను శుక్రవారం స్థానిక కార్పొరేటర్ కొత్త దుర్గమ్మగౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మల్లాపూర్ పారిశ్రామికవాడ నుంచి సూరజ్‌నగర్ కాలనీ వరకు పనులు చురుకుగా కొనసాగుతున్నాయన్నారు. ఈ రోడ్డు పనులు పూర్తైతే చెంగిచర్ల ప్రజలకు సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. కార్పొరేటర్ కుంభం కిరణ్‌కుమార్ రెడ్డి, మేడ్చల్ కాంగ్రెస్ పార్టీ బీ – బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిశోర్‌గౌడ్, సూరజ్‌నగర్ కాలనీ అధ్యక్షులు రచ్చ శ్రీనివాస్, కాలనీ వాసులు సిద్ధులు, అక్బర్, పద్మారెడ్డి, బాలరాజ్, రమణారెడ్డి, సుభాష్ పాల్గొన్నారు.


రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ దుర్గమ్మగౌడ్

అభివృద్ధే లక్ష్యంగా ప్రజాపాలన: శ్రీకాంత్‌గౌడ్



మల్లాపూర్: రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యంలో సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా ప్రజాపాలన కొనసాగుతుందని నాచారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బండారం శ్రీకాంత్‌గౌడ్ అన్నారు. శుక్రవారం ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్‌రెడ్డి ఆదేశాల మేరకు నాచారంలో ఇందిరమ్మ కమిటీ ఏర్పాటుపై కాంగ్రెస్ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌గౌడ్ మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో అభివృద్ధి సంక్షేమ ఫలాలు అర్హులకు అందుతున్నాయన్నారు. పారదర్శకంగా ప్రజలకు సేవ చేసేందుకే రాష్ట్రంలో ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. నాచారాం డివిజన్ సీనియర్ నేతలు బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీ నాయకులు, మహిళా నాయకురాలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించండి


కార్పొరేటర్ రాజ్యలక్ష్మికి వినతిపత్రం ఇస్తున్న కాలనీవాసులు

మౌలాలి: వినాయక్‌నగర్ డివిజన్ పరిధిలోని అంబేడ్కర్‌నగర్‌లో గత కొన్ని రోజులుగా డ్రైనేజీ ఓవర్‌ఫ్లో వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. కాలనీ వాసులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సానుకూలంగా స్పందించిన కార్పొరేటర్ రాజ్యలక్ష్మి, వాటర్ వర్క్స్ ఏఈ కృష్ణప్రసాద్‌తో కలిసి కాలనీలో పర్యటించారు. కాలనీ అధ్యక్షులు వేణుగోపాల్‌రెడ్డి, బీజేపీ అధ్యక్షులు ఓంప్రకాష్, గోపాల్, సాయి, సురేష్, శ్రీకాంత్, విశాల్ తదితరులు పాల్గొన్నారు.


బైక్ చోరీలకు పాల్పడుతున్న నిందితుడి రిమాండ్

రూ.2.40 లక్షల విలువైన వాహనాలు రికవరీ



ఉప్పల్: ద్విచక్రవాహనాల చోరీకి పాల్పడుతూ తప్పించుకు తిరుగుతున్న నిందితుడిని శుక్రవారం ఉప్పల్ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పల్ నాగోల్‌కు వెళ్లేదారిలో ఎస్‌వీఎం హోటల్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న సమయంలో బైక్‌పై వచ్చిన నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. సంగారెడ్డి జిల్లాకు కోహీర్ మండలం బిల్లాపూర్ గ్రామానికి చెందిన బత్తిని నరేష్ (27) అంబర్‌పేట్ పటేల్‌నగర్‌లో నివాసం ఉంటూ రాపిడో రైడర్‌గా పనిచేస్తున్నాడు. కాగా జల్సాలకు అలవాటుపడిన బత్తిని నరేష్ ఇంటిముందు చౌరస్తాలలో పార్కింగ్ చేసిన బైక్‌లను దొంగతనం చేయడం ప్రారంభించాడు. ఈ క్రమంలో ఈనెల 17న బోడుప్పల్ గౌతమ్‌నగర్ కాలనీకి చెందిన బోడ బద్దు వీటీ కాలనీ కమాన్ వద్ద తన యాక్టివాను పార్క్ చేసి అరగంటకు వచ్చి చూడగా కనిపించలేదు. దీంతో బాధితుడు ఉప్పల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. శుక్రవారం నాగోల్ రోడ్డులోని ఎస్‌వీఎం హోటల్ వద్ద బత్తిని నరేష్ అనుమానాస్పదంగా వాహనాల తనిఖీలో పట్టుబడ్డాడు. పోలీసుల విచారణలో పటాన్ చెరువు పోలీస్‌స్టేషన్ పరిధిలో 02, చిలుకలగూడ పీఎస్ పరిధిలో 01, ఉప్పల్ పీఎస్ పరిధిలో 01 ద్విచక్రవాహనాన్ని దొంగిలించినట్లు విచారణలో తేలింది. 2023లో మలక్‌పేట్‌లో వాహనాల దొంగతనం కేసు విషయంలో చంచల్‌గూడ జైలు కు కుడా వెళ్లొచ్చాడు. మొత్తం రూ.2.40 లక్షల విలువైన ద్విచక్ర వాహనాలను నిందితుడి నుంచి పోలీసులు రికవరీ చేశారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

వ్యక్తి అదృశ్యం


చంద్రశేఖర్

మేడిపల్లి: ఇంటినుంచి బయటకు వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన మేడిపల్లి పోలీస్‌స్టేషన్‌లో పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బోడుప్పల్‌లో నివాసం ఉంటున్న చంద్రశేఖర్(39)స్థానికంగా బేకరీ నిర్వహిస్తున్నాడు. ఈనెల 15న ఇంట్లో చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబసభ్యులు ఆచూకీ కోసం వెతికినా లభ్యం కాకపోవడంతో శుక్రవారం మేడిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కార్పొరేటర్ పర్యటన



అల్వాల్: మచ్చబొల్లారం డివిజన్ మార్కెట్‌లోని పాత గ్రామపంచాయితీ భవనాన్ని శుక్రవారం కార్పొరేటర్ రాజ్‌జితేంద్రనాథ్, అల్వాల్ డీసీ శ్రీనివాస్‌రెడ్డితో కలిసి సందర్శించారు. ఈ భవనం కూలిపోయే స్థితిలో ఉందని, ఆక్రమణలకు గురికాకుండా కాపాడాలని, పలు ప్రభుత్వ కార్యాలయాలకు ఉపయోగపడేలా నూతన భవనాన్ని నిర్మించాలని కోరారు. స్థానిక కాంగ్రెస్ నేతలు, అధికారులు పాల్గొన్నారు.

దిష్టిబొమ్మ దహనం



రామంతాపూర్ : విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని శుక్రవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థి నాయకులు మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఏబీవీపీ నగర కార్యదర్శి మహేందర్, వరుణ్, సాగర్, శివ, శశి, అఖిల్, ప్రవీణ్, బాను తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి..

మేడిపల్లి: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ ఉప్పల్‌శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం పీర్జాదీగూడ కెనరానగర్ బస్‌స్టాప్ వద్ద ధర్నా చేపట్టారు. అనంతరం ప్రభుత్వం దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన రాష్ట్ర ఏబీవీపీ కార్యవర్గ సభ్యుడు కార్తీక్ మాట్లాడుతూ.. రూ.7,500 కోట్ల స్కాలర్‌షిప్ ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకుండా పేద, బలహీన వర్గాల విద్యార్థులను ఇబ్బందికి గురిచేయడం సరికాదన్నారు. ఇప్పటికైనా ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.